ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

**రిపోర్టర్లు కావలెను**

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా రిపోర్టర్లు కావలెను.

ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక

సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 2 | సంచిక: 362 | పేజీలు: 4 | వెల: రూ.3/- | బుధవారం 9 ఏప్రిల్ 2025 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

# 10 నిమిషాలల్లోనే రిజిస్ట్రేషన్ పూర్తి





**రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ విభాగంలో స్లాట్ బుకింగ్ విధానానికి శ్రీకారం**

**ఈ నెల 10 ప్రారంభం వెల్లడించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**హైదరాబాద్, ఏప్రిల్ 8 (ప్రభాత ఉదయం):** రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ సరళతరం చేసేందుకు సర్కారు చర్యలు తీసుకుంటోంది. ప్రజలకు సమర్థవంతంగా సులువుగా, వేగవంతంగా, పారదర్శకంగా, అవినీతిరహితంగా మరింత మెరుగైన సేవలు అందించేందుకు సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలను ఆధునీకరిస్తోంది. ఇందులో భాగంగానే డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ కోసం గంటల తరబడి నిరీక్షించే పనిలేకుండా కేవలం 10 నుంచి 15 నిమిషాల వ్యవధిలోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ సాఫీగా పూర్తయ్యేలా స్లాట్ బుకింగ్ విధానం అమల్లోకి తీసుకురాబోతోంది. రాష్ట్రంలో 144 సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండగా మొదటి దశలో ప్రయోగాత్మకంగా 22 సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ నెల 10వ తేదీ నుంచి స్లాట్ బుకింగ్ విధానాన్ని అమలులోకి తీసుకురాబోతున్నామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. నేరుగా విచ్చేసి రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవచ్చు : హైదరాబాద్‌లోని ఆజంపుర, చిక్కడపల్లి, సంగారెడ్డి జిల్లా సదాశివపేట, మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్, వల్లభ్‌నగర్, రంగారెడ్డి జిల్లా శంషాబాద్,

..మిగతా 2లో





# దిల్‌సుఖ్‌నగర్ జంట పేలుళ్ల కేసు

**ఐదుగురు దోషులకు ఉరిశిక్ష ఖరారు**

**దాడిలో 18 మంది మృతి, 131 మందికి గాయాలు**

**12 ఏళ్ల తర్వాత తుది తీర్పు ఇచ్చిన హైకోర్టు**

**హైదరాబాద్, ఏప్రిల్ 8 (ప్రభాత ఉదయం):** దిల్‌సుఖ్‌నగర్ జంట పేలుళ్ల కేసులో దోషులకు హైకోర్టు ఉరిశిక్ష ఖరారు చేసింది. 2016లో ఎన్ఐఏ ప్రత్యేక కోర్టు విధించిన తీర్పును సమర్థిస్తూ తీర్పునిచ్చింది. ప్రత్యేక కోర్టు తీర్పును సవాలు చేస్తూ దోషులు దాఖలు చేసిన క్రిమినల్ అప్పీల్‌ను ధర్మాసనం కొట్టేసింది. 2013 ఫిబ్రవరి 21న దిల్‌సుఖ్‌నగర్‌లో జంట బాంబు పేలుళ్లలో 18 మంది మృతి చెందగా 131 మందికి గాయాలయ్యాయి. ఐదుగురు దోషులు ప్రస్తుతం తీహార్ జైలులో ఉండగా ప్రధాన సూత్రధారి రియాజ్ బత్కల్ ఇంకా పాకిస్థాన్‌లో తలదాచుకుంటున్నాడు. అసలేం జరిగింది? : 2013లో హైదరాబాద్‌తో పాటు దేశ ప్రజలను ఉలిక్కి పడేలా చేసిన దిల్‌సుఖ్‌నగర్ వరుస బాంబు పేలుళ్ల కేసులో హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. భాగ్యనగర చరిత్రలో మానని గాయంగా మిగిలిన ఘటనలో ఐదుగురు దోషులకు ఉరిశిక్ష విధించింది. 2013 ఫిబ్రవరి 21న జరిగిన పేలుళ్లలో 18 మంది మృతి చెందగా 131 మందికి గాయాలయ్యాయి. 2015లో విచారణ

..మిగతా 2లో

## రేవంత్ రెడ్డిని కాపాడుతుందే బీజేపీ నాయకత్వం

**బీజేపీ, కాంగ్రెస్ ఉమ్మడి సిఎం రేవంత్‌రెడ్డి**

**రక్షణ కవచంగా నిలిచిన బండి సంజయ్**

**మీడియాతో కెటిఆర్**



**హైదరాబాద్, ఏప్రిల్ 8 (ప్రభాత ఉదయం):** సీఎం రేవంత్ రెడ్డిని కాపాడుతుందే బీజేపీ నాయకత్వమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, కెటి రామారావు ఆరోపించారు. దేశంలో అత్యంత పవర్ ఫుల్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అని తెలిపారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యంగా ఘాటు వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం కేటీఆర్ మీడియాతో చిట్‌చాట్ సందర్భంగా ..బీజేపీ, కాంగ్రెస్ ఉమ్మడిగా బలపర్చిన ఒకే ఒక్క ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అని చెప్పారు.రేవంతర్ రెడ్డికి బండి సంజయ్ రక్షణ కవచమని కేటీఆర్ ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం అనుకుంటే హెచ్‌సీయూ భూముల అమ్మకం ఆపలేదా అని నిలదీశారు.రాజకీయ బాంబులు పేలకపోవటంతో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సైలెంట్ అయ్యారని విమర్శించారు. అమృత్ టెండర్లలో అవినీతి జరిగిందని బీజేఎల్పీ లీడర్ మహేశ్వరరెడ్డి కూడా అన్నారని కేటీఆర్ గుర్తుచేశారు. రేవంత్, రాహుల్ (ఆర్ఆర్) టాక్స్ అని స్వయంగా ప్రధాని మోదీ అన్నారని... కానీ యాక్షన్ ఎందుకు తీసుకోలేదని కేటీఆర్ ప్రశ్నించారు. బీజేపీ కోసం తామెందుకు.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉంటామని అన్నారు. హైదరాబాద్ పరిధిలో పోటీకి తమకు సరిపడా నంబర్ లేదని చెప్పారు. ఎన్నికల్లో పోటీపై తమ విధానం తమకు ఉంటుందని అన్నారు. ఎల్పీజీ ధర పెంచి కేంద్ర ప్రభుత్వం ప్రజల నడ్డి విరుస్తోందని విమర్శించారు. హెచ్‌సీయూ భూముల విషయంలో కేంద్రమంత్రి బండి సంజయ్‌కు అంత ఉలికిపాటు ఎందుకని కేటీఆర్ ప్రశ్నించారు. జాతీయ పార్టీలను నమ్ముకుంటే తెలంగాణ మునిగినట్లేనని విమర్శించారు. వరంగల్

..మిగతా 2లో

# సబర్మతి ఆశ్రమాన్ని సందర్శించిన రేవంత్



**అహ్మదాబాద్ ఏప్రిల్ 8 (ప్రభాత ఉదయం):** సీఎం రేవంత్ రెడ్డి అహ్మదాబాద్‌లోని సబర్మతీ ఆశ్రమం సందర్శించారు. జాతిపిత మహాత్మ గాంధీకి నివాళులర్పించారు. సబర్మతీ ఆశ్రమంలో సాగిన మహాత్మా గాంధీ జీవన విధానం, ఆశ్రమ విశిష్టతలను సీఎం అక్కడి నిర్వహకులను అడిగి తెలుసుకున్నారు. ఆశ్రమంలో గాంధీ వాడిన చరఖాను తిప్పి దాన్ని పరిశీలించారు. అనంతరం ఆశ్రమంలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. కాగా గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరిగే రెండు రోజుల ప్రత్యేక కార్యక్రమాలు, సమావేశాల కోసం సీఎం రేవంత్ రెడ్డి గుజరాత్ వెళ్లారు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం మహాత్మాగాంధీ స్వాతంత్ర్య ఉద్యమంలో భాగంగా ఏర్పాటు చేసిన సబర్మతీ ఆశ్రమాన్ని విజిట్ చేశారు.

## తమిళనాడు గవర్నర్ తీరుపై
# సుప్రీం ఆగ్రహం

**బిల్లులు తొక్కిపెట్టడం పట్ల తీవ్ర అసహనం**

**బిల్లులన్నీ ఆమోదం పొందినట్లుగా ప్రకటన**

**తమిళనాడు ప్రభుత్వానికి పెద్ద ఊరట**

2






# పోర్చుగల్ పర్యటనలో రాష్ట్రపతి ముర్ము

**లిస్బన్, న్యూఢిల్లీ, ఏప్రిల్ 8 (ప్రభాత ఉదయం):** పోర్చుగల్- భారత్ ద్వైపాక్షిక సంబంధాలు 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్నాయి. ఈ సందర్భంగా భారత రాష్ట్రపతి ద్రౌపదిముర్మ పోర్చుగల్ పర్యటనకు వెళ్లారు. ఈ పర్యటనలో భాగంగా పోర్చుగల్ అధ్యక్షుడు మార్సెలో రెబెలో డి సౌసా సోమవారం సాయంత్రం లిస్బన్‌లోని పలాసియో డా అజుడాలో విందు ఏర్పాటు- చేశారు. ఈ విందుకు ద్రౌపది ముర్మ మాజరయ్యారు. ఈ విషయాన్ని రాష్ట్రపతి భవన్ వెల్లడించింది. ఈ సందర్భంగా 'పోర్చుగల్ - భారత్ ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాలకు 50 సంవత్సరాలు పూర్తయ్యాయి. ఈ నేపథ్యంలో ఇరు దేశాలు విభిన్న రంగాలలో సహకరించుకుంటూ డైనమిక్ భాగస్వామంగా పరిణామం చెందేందుకు దృఢంగా ఉన్నాయి అని ముర్మ నొక్కి చెప్పారు.



రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే జీఎంఆర్

# కొత్తకోటను రెవిన్యూ డివిజన్‌గా ప్రకటించాలి

కొత్తకోట, ఏప్రిల్ 8(ప్రభాత ఉదయం) కొత్తకోటను కొత్తగా రెవిన్యూ డివిజన్ గా ప్రకటించాలని రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని ఎమ్మెల్యే జిఎంఆర్ కోరారు. మంగళవారం హైదరాబాదులో దేవరకద్ర శాసనసభ్యులు జి మధుసూదన్ రెడ్డి తో కలసి కొత్తకోట మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్ లను నివాసంలో కలిసి రెవిన్యూ డివిజన్, రిజిస్ట్రేషన్ ఆఫీస్ ఏర్పాటుపై మంత్రికి వినతి పత్రం అందజేశారు..కొత్తకోట పట్టణాన్ని రెవెన్యూ డివిజన్ గా ప్రకటించేందుకు అన్ని సదుపాయాలు ఉన్నాయని త్వరలో పట్టణాన్ని రెవెన్యూ డివిజన్ గా ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి పి జె బాబు, వేముల శ్రీనివాస్ రెడ్డి, ఎన్ జె.బోయోజ్, పి కృష్ణారెడ్డి, బీచుపల్లి యాదవ్, శేఖర్ రెడ్డి, జెసిబి రాములు, లతీఫ్, మాసన్న, శివరాములు, శివరాజ్, నాగరాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# దిల్‌సుఖ్‌నగర్ జంట పేలుళ్ల కేసు

మొదటి పేజీ తరువాయి...

ప్రారంభించిన ఎన్ఐఏ ప్రత్యేక న్యాయస్థానం 157 మంది సాక్షులను ప్రశ్నించింది. 2016లో ఐదుగురిని దోషులుగా నిర్ధారిస్తూ ఉరిశిక్ష విధించింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ దోషులు హైకోర్టులో క్రిమినల్ అప్పీల్ దాఖలు చేశారు. జస్టిస్ కే.లక్ష్మణ్, జస్టిస్ పీ.శ్రీసుధలతో కూడిన ప్రత్యేక ధర్మాసనం 45 రోజుల పాటు విచారణ చేపట్టింది. ఇరువైపులా వాదనలు విన్న అనంతరం ఎన్ఐఏ ప్రత్యేక కోర్టు ఉత్తర్వులను సమర్థిస్తూ తీర్పునిచ్చింది. దోషులు దాఖలు చేసిన అప్పీలును కొట్టి వేసింది. పాకిస్థాన్‌లో తలదాచుకున్నకీలక సూత్రధారి : 2013 ఫిబ్రవరి 21న దిల్‌సుఖ్‌నగర్‌లోని బస్టాప్ వద్ద రాత్రి 7 గంటల సమయంలో మొదటి పేలుడు జరిగింది. క్షణాల వ్యవధిలోనే కోణార్క్ థియేటర్ సమీపంలోని ఏ-1 మిర్చి సెంటర్ వద్ద రెండో పేలుడు సంభవించింది. ఆ ప్రాంతమంతా రక్తమోడుతూ భీతావహంగా మారగా ఓ మహిళతో పాటు ఆమె గర్భంలో ఉన్న శిశువు సైతం గాయాలపాలవడం పరిస్థితి తీవ్రతకు నిదర్శనంగా నిలిచింది. ఘటనపై తొలుత కేసు నమోదు చేసిన సరూర్ నగర్ పోలీసులు అదే ఏడాది మార్చి 13న ఎన్ఐఏకు బదిలీ చేశారు. ఇండియన్ ముజహిద్దీన్ ఉగ్రవాద సంస్థ పేలుళ్లకు పాల్పడినట్లు ఎన్ఐఏ దర్యాప్తులో గుర్తించింది. యాసిన్ బత్కల్, అబ్దుల్లా అక్తర్‌లను 2013లోనే ఇండో నేపాల్ సరిహద్దు వద్ద అరెస్ట్ చేశారు. వారిచ్చిన సమాచారం ఆధారంగా బిహార్‌కు చెందిన తహసీన్ అక్తర్, పాకిస్థాన్‌కు చెందిన జియా ఉర్ రెహమాన్‌లను 2014 మేలో రాజస్థాన్‌లో అరెస్ట్ చేశారు. వీరితో పాటు పుణేకి చెందిన అజీజ్ షేక్‌ను సైతం ఎన్ఐఏ అధికారులు అరెస్ట్ చేశారు. పేలుళ్లకు కీలక సూత్రధారి మహ్మద్ రియాజ్ అలియాస్ రియాజ్ బక్తల్ విచారణలో గుర్తించారు. రియాజ్ బక్తల్ పాకిస్థాన్‌లో తలదాచుకున్నట్లు దర్యాప్తులో తేలింది. కేసులో దర్యాప్తు చేపట్టిన ఎన్ఐఏ అధికారులు 5 వేల పేజీలతో అభియోగ పత్రం దాఖలు చేశారు. 2015లో విచారణ ప్రారంభించిన ప్రత్యేక న్యాయస్థానం 157 సాక్షులను ప్రశ్నించింది. అన్నింటిని పరిగణలోకి తీసుకున్న ఎన్ఐఏ ప్రత్యేక కోర్టు 2016 డిసెంబర్ 13న ఐదుగురిని దోషులుగా తేల్చింది. అతి అరుదైన కేసుగా భావించిన న్యాయస్థానం అదే నెల 19న మరణశిక్ష ఖరారు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ ఐదుగురు దోషులు 2016 డిసెంబర్‌లో హైకోర్టును ఆశ్రయించారు. తీర్పును రద్దు చేయాలంటూ క్రిమినల్ అప్పీల్ దాఖలు చేశారు. జస్టిస్ కే.లక్ష్మణ్, జస్టిస్ శ్రీసుధలతో కూడిన ప్రత్యేక ధర్మాసనం అప్పీలుపై విచారణ చేపట్టింది. ఇరువైపులా వాదనలు విన్న ధర్మాసనం ఎన్ఐఏ ప్రత్యేక న్యాయస్థానం ఉత్తర్వులను సమర్థిస్తూ తీర్పు వెలువరించింది.ఐదుగురు నిందితులు ప్రస్తుతం తీహార్ జైలులో రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు. హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేస్తామని అజాజ్ షేక్ తరఫు న్యాయవాది తెలిపారు. హైకోర్టు చరిత్రాత్మకమైన తీర్పు వెలువరించిందని ఎన్ఐఏ తరపు న్యాయవాది వెల్లడించారు.

# తమిళనాడు గవర్నర్ తీరుపై సుప్రీం ఆగ్రహం

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 8 (ప్రభాత ఉదయం):** తమిళనాడు శాసనసభ పంపిన పది బిల్లులను గవర్నర్ రిజర్వ్‌లో పెట్టుకోవడం అక్రమం అని, న్యాయ వ్యతిరేకమైందని, అందుకే ఆ చర్యలను పక్కన పెడుతున్నామని, ఆ బిల్లులను గవర్నర్‌కు సమర్పించిన నాటి నుంచి వాటికి క్లియరెన్స్ దక్కినట్లు సుప్రీంకోర్టు ప్రకటించింది. తమ బిల్లులకు గవర్నర్ అనుమతి ఇవ్వడం లేదని తమిళనాడు ప్రభుత్వం దాఖలు చేసిన పిటీషన్‌పై కోర్టు తాజా ఆదేశాలు జారీ చేసింది. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో గవర్నర్ల చాలా చురుకుగా పనిచేయాలని కోర్టు పేర్కొన్నది. ఓ స్నేహితుడిగా, మార్గదర్శిగా, తత్వవేత్తగా గవర్నర్ పనిచేయాలని కోర్టు సూచించింది. రాజకీయ ప్రేరణతో ఆయన పనిచేయరాదు అని ధర్మాసనం తెలిపింది. సమస్యలు పరిష్కరించడంలో గవర్నర్ ఓ దూతలా ఉండాలని, ఓ ఉత్ప్రేరకంగా పనిచేయాలని కోర్టు చెప్పింది. రాజ్యాంగ విలువల్ని గవర్నర్లు రక్షించాలని 2020 నుంచి 2023 వరకు సుమారు 12 బిల్లలను తమిళనాడు అసెంబ్లీ.. గవర్నర్ అనుమతి కోసం పంపింది. కానీ గవర్నర్ ఆ బిల్లులను నిరవధికంగా వాయిదా వేశారు. దీంతో ఆ బిల్లుల అనుమతి కోరుతూ తమిళనాడు సర్కారు సుప్రీంకోర్టును ఆశ్రయించింది. అయితే 2023 నవంబర్‌లో రెండు బిల్లులను రాష్ట్రపతి ఆమోదం కోసం పంపగా, మరో 10 బిల్లులు గవర్నర్ వద్దే ఉండిపోయాయి. అయితే కొన్ని రోజుల వ్యవధిల్లో మళ్లీ ఆ పది బిల్లులను రాష్ట్ర శాసనసభలో పాస్ చేయించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 200 ప్రకారం గవర్నర్ అనుమతి కోరుతున్నట్లు- తమిళనాడు సర్కారు తన పిటీషన్‌లో సుప్రీంకు తెలిపింది.

# 10 నిమిషాలల్లోనే రిజిస్ట్రేషన్ పూర్తి

మొదటి పేజీ తరువాయి...



సరూర్‌నగర్, చంపాపేట్, పెద్దపల్లి జిల్లా రామగుండం, ఖమ్మం జిల్లా కూసుమంచి, ఖమ్మం, మేడ్చల్, మహబూబ్‌నగర్, జగిత్యాల, నిర్మల్, వరంగల్ ఫోర్ట్, వరంగల్ గ్రామీణం, కొత్తగూడెం, ఆర్మూర్, భువనగిరి, చౌటుప్పల్, నాగర్‌కర్నూల్ మొత్తం 22 చోట్ల ఈ కార్యక్రమానికి తాము శ్రీకారం చుడుతున్నామని తెలిపారు. సబ్-రిజిస్టార్ కార్యాలయంలో ఒకేరోజు ఒకే సమయంలో ఎక్కువ దస్తావేజులు రిజిస్ట్రేషన్ కోసం సమర్పించడం వల్ల జరిగే జాప్యం నివారించేందుకు సబ్-రిజిస్ట్రార్ కార్యాలయ రోజువారీ పని వేళలను 48 స్లాట్లుగా విభజించడం జరిగిందన్నారు. ప్రజలు నేరుగా registration.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా తమకు అనుకూలమైన తేదీ, సమయానికి స్లాట్ బుక్ చేసుకుని ఆ రోజు నిర్దేశించిన సమయానికి నేరుగా విచ్చేసి రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకుని వెంటనే వెళ్లిపోవచ్చని సూచించారు. స్లాట్ బుక్ చేసుకోని వారి కోసం ఏదైనా అత్యవసర సందర్భాలలో ప్రతి రోజు సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు, ఐదు వాక్ ఇన్ రిజిస్ట్రేషన్లను అనుమతిస్తారని, నేరుగా కార్యాలయానికి వచ్చిన వారికి ఫస్ట్ కం ఫస్ట్ సర్వ్ పద్ధతిలో ఆ దస్తావేజులు స్వీకరిస్తారని మంత్రి పొంగులేటి తెలిపారు.

రిజిస్ట్రార్ కార్యాలయాల పునర్నిర్మాణం : సాధారణంగా పని ఒత్తిడి ఎక్కువగా ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానం సులభతరం చేయడం, 48 స్లాట్స్ కన్నా ఎక్కువ స్లాట్స్ అవసరం ఉన్న కార్యాలయాల్లో ఇప్పుడున్న సబ్ రిజిస్ట్రార్లకు తోడుగా అదనపు సబ్ రిజిస్ట్రార్లను ప్రభుత్వం నియమించనుంది. ప్రయోగాత్మకంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ కార్యాలయంలో అదనంగా ఇద్దరు సబ్ రిజిస్ట్రార్లు, సిబ్బందిని నియమించిన దృష్ట్యా 144 స్లాట్స్ అందుబాటులో ఉంటాయి.

స్లాట్ బుకింగ్ విధానం దృష్టిలో పెట్టుకొని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను పునర్నిర్మాణం చేస్తోంది. అధిక రద్దీ, తక్కువ రద్దీ ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిని అనుసంధానం చేసి పని భారం సమానం చేయడానికి చర్యలు తీసుకుంటుంది. ఈ విధానం ముందుగా రంగారెడ్డి జిల్లా చంపాపేట, సరూర్‌నగర్ సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల అధికార పరిధిని విలీనం చేసింది.

రిజిస్ట్రేషన్ చేసుకునే ప్రజలు అవగాహన లేమి కారణంగా ఇతరులపై ఆధారపడకుండా సొంతంగా దస్తావేజులు తయారు చేసుకోవడానికి వీలు కల్పిస్తూ ప్రభుత్వం వెబ్‌సైట్‌లోనే ఒక మాడ్యూల్ ప్రవేశపెట్టింది. మొదటగా సేల్ డీడ్ దస్తావేజుల కోసమే ఈ సౌకర్యం ఉంటుంది. అయితే ఇది కూడా ఐచ్ఛికమే. రిజిస్ట్రేషన్ సమయంలో దస్తావేజుపై విక్రేతలు, క్రయదారులు, సాక్షులు, సబ్ రిజిస్ట్రార్ వ్యక్తిగతంగా లేదా భౌతికంగా సంతకాలు చేయడానికి చాలా సమయం పట్టడం వల్ల దస్తావేజు రిజిస్ట్రేషన్ ప్రక్రియ చాలా ఆలస్యమవుతోంది. ఫలితంగా ప్రజల సమయం చాలా వృధా అవడం ద్వారా ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఆ సమస్య నివారించడానికి రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేయడంలో భాగంగా ఆధార్ ఇ-సంతకం ప్రవేశపెడుతోంది. ఇది ఈ నెల చివరిలోగా అందుబాటులోకి తీసుకువస్తామని మంత్రి పొంగులేటి వెల్లడించారు.

డబుల్ రిజిస్ట్రేషన్లు నివారించడానికి చట్టం : మరోవైపు, ప్రతిరోజు ఎక్కడో ఒకచోట మా ఆస్తి డబుల్ రిజిస్ట్రేషన్ జరిగిందనే ఫిర్యాదులు ప్రజల నుంచి ఇబ్బడిముబ్బడిగా వస్తున్నాయి. ఈ క్రమంలో డబుల్ రిజిస్ట్రేషన్లు నివారించడానికి చట్టం సవరించబోతుంది ప్రభుత్వం. డబుల్ రిజిస్ట్రేషన్‌కు సంబంధించి వివిధ రాష్ట్రాలు ఇప్పటికే చట్టాలు సవరించుకున్నాయి. అదే విధంగా తెలంగాణలో కూడా చట్టసవరణ చేయడానికి చర్యలు తీసుకుంటుంది. రిజిస్ట్రేషన్ చట్టంలో కొత్తగా సెక్షన్స్ 22 కి సవరణ చేస్తూ సెక్షన్ 22-బీ తీసుకురావడం జరుగుతుండటం విశేషం.

# సింగపూర్ స్కూల్‌లో అగ్నిప్రమాదం

## పవన్ తనయుడు మార్క్ శంకర్‌కు గాయాలు



**హైదరాబాద్, ఏప్రిల్ 8 (ప్రభాత ఉదయం):** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చిన్న కుమారుడు మార్క్ శంకర్ పవనోవిచ్ గాయపడ్డాడు. సింగపూర్‌లోని స్కూల్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో అతడి చేతులు, కాళ్లకు గాయాలయ్యాయి. అతడితో పాటు పలువురు చిన్నారులు గాయపడగా వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈవిషయం తెలుసుకున్న పవన్ కల్యాణ్ సింగపూర్ వెళ్లనున్నారు. సింగపూర్‌లోని రివర్ వ్యాలీ షాప్‌హౌస్‌లో మంగళవారం ఉదయం 9.45 గంటలకు ఈ ఘటన చోటు-చేసుకుంది. ఈ భవనంలో చిన్నారులకు క్యాంప్ నిర్వహిస్తున్నారు. రెండు, మూడు అంతస్తుల్లో మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న సింగపూర్ సివిల్ డిఫెన్స్ ఫోర్స్ ఘటనాస్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టింది. భవనం లోపల చిక్కుకున్న వారిని రక్షించి రెస్క్యూ సిబ్బంది బయటకు తీసుకొచ్చారు. ఈ ప్రమాదంలో 15 మంది చిన్నారులు సహా 19 మంది గాయపడ్డారు. వీరిని స్థానిక ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. చికిత్స పొందుతూ అందులో ఓ చిన్నారి ప్రాణాలు కోల్పోయినట్లు- సింగపూర్ మీడియా కథనాలు వెల్లడించాయి. పవన్ కుమారుడు మార్క్ శంకర్ చేతులు, కాళ్లకు గాయాలయ్యాయి. ఊపిరితిత్తుల్లోకి పొగ వెళ్లడంతో అస్వస్థతకు గురయ్యాడు. ప్రస్తుతం అతడికి ఆసుపత్రిలో చికిత్స అందుతోంది. ఈ ఘటనకు గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్లు- అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం పవన్ అల్లూరి సీతారామరాజు జిల్లా పర్యటనలో ఉన్నారు. కార్యక్రమాలను రద్దు చేసుకొని సింగపూర్ వెళ్లాలని పార్టీ నేతలు ఆయనకు సూచించారు. ఇచ్చినమాట ప్రకారం గిరిజనులను కలిసి వెళ్తానని పవన్ చెప్పారు. మంగళవారం ప్రారంభించాల్సిన అభివృద్ధి కార్యక్రమాలకు ఏర్పాట్లు చేసినందున వాటిని పూర్తిచేసి వెళ్తానన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పర్యటన ముగిసిన తర్వాత పవన్ సింగపూర్ వెళ్లనున్నారు.

# దేశంలో ఎస్సీ, ఎస్టీ, బిసిల పట్ల వివక్ష

**బిసిలకు జరుగుతున్న అన్యాయంపైనే నా గళం**

**పూలే విగ్రహ ఏర్పాటుపై 11లోగా ప్రకటన చేయాలి**

**ఇందిరాపార్క్ వద్ద ధర్నాలో ఎమ్మెల్సీ కవిత డిమాండ్**

**హైదరాబాద్, ఏప్రిల్ 8 (ప్రభాత ఉదయం):** దేశంలో బీసీ, ఎస్సీ, ఎస్టీల పట్ల జరుగుతున్న వివక్షను అడ్డుకోవాల్సి ఉందని ఎమ్మెల్సీ కవిత అన్నారు. బీసీల హక్కుల కోసం ఇందిరాపార్క్ వద్ద చేపట్టిన దీక్షలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ఇది ప్రజాస్వామ్య దేశమా? అనే ప్రశ్నలను ఆమె సంధించారు. శ్రీరామనవమి సందర్భంగా రాజస్థాన్ లో కాంగ్రెస్ ఎమ్మెల్యే టికారాం జుల్లి రామాలయాన్ని దర్శించుకెళ్తే, ఆలయం మైలపడిందని అభిప్రాయపడుతూ సంప్రోక్షణ చేపట్టిన దళిత వ్యతిరేక వర్గాల చర్యలను ఆమె తీవ్రంగా ఖండించారు. ఇలాంటి దౌర్భాగ్యమైన ఘటనలు బీజేపీ పాలిత రాష్ట్రాల్లో జరుగుతున్నాయంటే, ప్రజాస్వామ్యం, సమానత్వం, సోదరభావం అన్నది కేవలం మాటలకే పరిమితమవుతోందని ఆమె వ్యాఖ్యానించారు. అయోధ్యలో రామమందిరం ప్రారంభోత్సవానికి దేశపు గౌరవనీయ రాష్ట్రపతిని ఆహ్వానించకపోవడాన్ని ఆమె తీవ్రంగా విమర్శించారు. రాష్ట్రపతి గిరిజన మహిళ అయితే ఏమి? ఆమెను ఆహ్వానించకపోవడం బీజేపీ ప్రభుత్వం ఎస్టీ సామాజిక వర్గం పట్ల తీసుకున్న దారుణ వైఖరని పేర్కొన్నారు. బీసీలకు కూడా ఈ దేశంలో ఇప్పటికీ అనేక అవమానాలు జరుగుతున్నాయని ఆమె అన్నారు. ధర్నాలు ఎందుకు చేస్తున్నాం? అని కొంతమంది అడుగుతున్నారని, బీసీ సామాజిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యల పట్ల నా ఆవేశం, ఆవేదన ఇవి. రాజకీయ అవసరం కాదు, ఇది హక్కుల పోరాటం అని స్పష్టం చేశారు. ఈబ్ల్యూఎస్ అమలుతో 50శాతం రిజర్వేషన్ పరిమితిని ఎత్తేసిన నేపథ్యంలో, కోర్టులు రిజర్వేషన్‌ను అడ్డుకునే అవకాశమే లేదని ఆమె అభిప్రాయపడ్డారు. బీసీలకు అర్హతకు తగ్గ రిజర్వేషన్లు ఇవ్వాలంటే ఇది సరైన సమయమని పేర్కొన్నారు. అసెంబ్లీ ఆవరనలో పూలే విగ్రహం పెట్టాలని తాము కోరుతున్నామని, ఇందుకోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నామని అన్నారు.



ఏఐ అంటే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కాదని, అనుముల ఇంటెలిజెన్స్ అని, ఇది రాష్ట్రానికి ప్రమాదమని కల్వకుంట్ల కవిత అన్నారు. అసెంబ్లీ ఆవరణలో పూలే విగ్రహం ఏర్పాటుకై కవిత మంగళవారం ఇందిరాపార్క్ వద్ద నిరాహార దీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వాస్తవానికి అనుముల ఇంటెలిజెన్స్‌తోనే రాష్ట్రానికి ప్రమాదమని వ్యాఖ్యానించారు. ఇది రాష్ట్రంలో విధ్వంసం సృష్టిస్తోందని కవిత అన్నారు. ఇది పక్కకు జరిగితే తప్ప రాష్ట్రం బాగుపడే పరిస్థితి కనిపించడం లేదని చెప్పారు. ప్రజలను మోసం చేయడమే అనుముల పని అని విమర్శించారు. అనుముల ఇంటెలిజెన్స్‌ను వాడి కులగణనను తప్పుదోవ పట్టించారని, బీసీకు అన్యాయం చేస్తున్నారని అన్నారు. సర్వే వివరాలను అసెంబ్లీలో పెట్టకుండా అధ్యయనం చేసిన తర్వాత రిజర్వేషన్ ఇస్తారట అని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ హయాంలో సమగ్ర కుటుంబ సర్వే వివరాలను వెబ్‌సైట్‌లో పెట్టామని, కాంగ్రెస్ ప్రభుత్వానికి ఆ ధైర్యం ఎందుకు లేదని కవిత ప్రశ్నించారు. 2011లో యూపీఏ హయాంలో దేశంలో కులగణన చేసినా ఇప్పటికీ ఆ వివరాలు వెల్లడించలేదని అన్నారు. ఆ వివరాలను వెల్లడించేలా కేంద్రంపై ఒత్తిడి చేయాలని, అందుకు తాము కూడా కలిసి వస్తామని చెప్పారు. అదేవిధంగా కాంగ్రెస్ నేతలలాగా తాము ఢిల్లీలో దొంగ దీక్షలు చేయబోమని, అవసరమైతే ఢిల్లీకి వెళ్లి నిరవధికంగా దీక్షకు కూర్చుంటామని అన్నారు. చట్టసభలు బిల్లులను ఆమోదించి నాలుగు వారాలైందని, ప్రస్తుతం ఆ బిల్లుల స్థితి ఏమిటో ప్రభుత్వం చెప్పాలని కవిత డిమాండ్ చేశారు. ఆ బిల్లులు గవర్నర్ వద్దనే పెండింగ్‌లో ఉన్నాయా.. లేదంటే రాష్ట్రపతికి పంపించారా..? అని నిలదీశారు.

# యూనివర్సిటీల్లో 1061 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీ

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడి**

**హైదరాబాద్, ఏప్రిల్ 8 (ప్రభాత ఉదయం):** తెలంగాణ రాష్ట్రంలో విద్యారంగ పునర్నిర్మాణం వైపు ప్రజా ప్రభుత్వం బలమైన అడుగులు వేస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తాజాగా ట్విట్టర్ వేదికగా ఒక ముఖ్యమైన ప్రకటన చేశారు. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న 1061 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి మార్గదర్శకాలు విడుదల చేసినట్టు తెలిపారు. ఈ పక్రియను 15 సంవత్సరాల పాటు- నిర్వహించకపోవడం నిజంగా షాకింగ్ అని వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వ పాలనలో విద్య రంగం పట్ల చూపిన నిర్లక్ష్యం పేద బిడ్డల భవిష్యత్‌ను దెబ్బతీసిందని సీఎం విమర్శించారు. ఇది క్షమించలేని నేరమని ఆయన పేర్కొన్నారు. పేద విద్యార్థులకు ఉన్నత విద్య అందించడంలో గత ప్రభుత్వం విఫలమైన తీరు రాష్ట్రం అభివృద్ధికి అడ్డు పడిందని చెప్పారు. ఈ మేరకు జరిగిన పొరపాట్లను గుర్తిస్తూ, సరిచేస్తూ ప్రజా ప్రభుత్వం రాష్ట్ర పునర్నిర్మాణం దిశగా ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు. ముఖ్యంగా విద్యా వ్యవస్థలో గల ఖాళీలను నింపుతూ, నాణ్యతగల బోధనకు అవసరమైన మానవ వనరులను సమకూర్చే దిశగా ఈ చర్యలు ఎంతో కీలకమని వ్యాఖ్యానించారు. ఈ పోస్టుల భర్తీతో రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలకు కొత్త ఊపిరి లభించనుంది. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం అందించేందుకు ఇది కీలక దశగా మారనుంది. ముఖ్యంగా పేద కుటుంబాల నుండి వచ్చిన విద్యార్థులకు ఇది ఒక రకం న్యాయం కూడా. విద్యారంగాన్ని బలోపేతం చేయడమే రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి మించిన దారి అంటూ, ముఖ్యమంత్రి పేర్కొంటూ ఈ పక్రియను త్వరితగతిన పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

# రేవంత్ రెడ్డిని కాపాడుతుందే బీజేపీ నాయకత్వం

మొదటి పేజీ తరువాయి...

సభ ద్వారా ఇదే సందేశాన్ని కేసీఆర్ ప్రజలకు ఇవ్వబోతున్నారని తెలిపారు. హాస్టల్స్, గురుకులాల్లో సన్న బియ్యం ప్రవేశపెట్టిందే కేసీఆర్ అని చెప్పారు. సన్న బియ్యం కాన్సెప్ట్ కొత్తదేమీ కాదని అన్నారు. లోకల్ బాడీ ఎన్నికలు పెడితే.. కాంగ్రెస్‌కు ఉన్న ఆదరణ ఏంటో తెలుస్తుందని కేటీఆర్ తెలిపారు. నీటి కేటాయింపుల విషయంలో ఏపీ తరుపున వాదనలు వినిపించిన ఆదిత్యనాథ్ దాస్‌ను తెలంగాణ అడ్వైజర్‌గా నియమించడం ఏంటని మాజీ మంత్రి కేటీఆర్ ప్రశ్నించారు. చంద్రబాబు చెప్పినందున.. ఆదిత్యానాథ్ దాస్‌ను పెట్టుకున్నారేమోనని విమర్శించారు. తెలంగాణకు వ్యతిరేకంగా కొట్లాడిన వ్యక్తిని రాష్ట్ర ప్రభుత్వం నియమించటం ఏంటని కేటీఆర్ నిలదీశారు. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య నెలకొన్న నీటి సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శలు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత గోదావరి, కృష్ణా జలాల్లో విచ్చలవిడిగా జలదోపిడికి పాల్పడ్డారని ఆరోపించారు. కాంగ్రెస్‌కు కేసీఆర్‌పై ఉన్న ద్వేషంతో రైతులను ఎండ గడుతున్నారని ధ్వజమెత్తారు. మేడిగడ్డ ఎప్పుడు కొట్టుకుపోతుందా అని.. కాంగ్రెస్ గుంట నక్కలా ఎదురుచూస్తోందని కేటీఆర్ విమర్శించారు.

# నారాయణ స్కూల్‌లో చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే



అత్తాపూర్ లో గల నారాయణ స్కూల్‌లో జరిగిన గ్రాడ్యుయేషన్ డేలో పాల్గొన్న చిన్నారులు, ఉపాధ్యాయులు

బుద్వేల్, ఏప్రిల్ (ప్రభాత ఉదయం): అత్తాపూర్ నారాయణ స్కూల్ లో మంగళవారం చిన్నారులకు గ్యాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నారాయణ విద్యాసంస్థల ఏజీఎం శ్రీనివాసరెడ్డి, స్టేట్ కో ఆర్డినేటర్ శర్వాణిరెడ్డి, ప్రిన్సిపల్ కో అర్డినేటర్ ఫర్హానా, రష్మిక, ప్రిన్సిపాల్ మధుమతి, వైస్ ప్రిన్సిపాల్ వైల తులసి లు పాల్గొన్నారు.

**విద్యార్థి దశ విలువైనది :**

విద్యార్థి దశ ఎంతో విలువైనదిని నారాయణ స్కూల్ కు చెందిన శర్వాణి రెడ్డి, మధుమతి లు తెలిపారు. చిన్నారులను తీర్చిదిద్దడానికి నారాయణ విద్యాసంస్థల ఆధ్వర్యంలో కృషి చేస్తున్నామన్నారు.




జ్యోతి ప్రజ్వలన చేసి గ్రాడ్యుయేషన్ డే ను ప్రారంభిస్తున్న శర్వాణి రెడ్డి తదితరులు



## సోమ శ్రీనివాసులు పరామర్శించిన ఆర్యవైశ్య సంఘం నాయకులు

రాజేంద్రనగర్, ఏప్రిల్ 8(ప్రభాత ఉదయం) రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని బాబుల్ రెడ్డి నగర్ చెందిన ఆర్యవైశ్య సంఘం నాయకులు, మాజీ వార్డ్ కమిటీ సభ్యులు సోమ శ్రీనివాస్ గుప్తా ను ఆర్యవైశ్య సంఘం నాయకులు పరామర్శించారు. మంగళవారం ఇటీవల సోమ శ్రీనివాస్ గుప్తా తండ్రి సోమ జగన్నాథం కాలం చేసిన సందర్భంగా ఆయన ఇంటికి వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ యువజన సంఘం అధ్యక్షుడు ఇరుకుల రామకృష్ణ గుప్తా , ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు ఆగిరు వెంకటేష్ గుప్తా, ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శి అర్థం లక్ష్మయ్య గుప్త , వాసవి క్లబ్ వి102 ఏ గవర్నర్ డాక్టర్ సరాబు అనంతం గుప్తా , వలకొండ విజయ్ కుమార్ గుప్తా,చిగుళ్లపల్లి సత్యనారాయణ గుప్తా ,ఆకుతోట రవికుమార్ గుప్తా , సంబు సత్యనారాయణ గుప్తా తదితరులు సోమ శ్రీనివాస్ గుప్తా కుటుంబాన్ని పరామర్శించి స్వర్గీయ సోమ జగన్నాథం గుప్తా చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.



డాక్టర్ చీనా నాయక్‌ను కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న విద్యార్థులు

## డాక్టర్ చీనా నాయక్‌కు సన్మానం

బుద్వేల్, ఏప్రిల్ (ప్రభాత ఉదయం) : శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం డీన్ ఆఫ్ అగ్రికల్చరల్ గా నియమితులైన డాక్టర్ చీనా నాయక్ ను మంగళవారం విద్యార్థులు అభినందించారు. ఈ సందర్భంగా డాక్టర్ చీనా నాయక్ మాట్లాడుతూ, ఉద్యాన విశ్వవిద్యాలయం లో చదువుతున్న విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తును అందించడానికి కృషి చేస్తానన్నారు. ఉద్యాన పంటలను పండించే రైతులకు మేలు చేసే విదంగా కార్యక్రమాలు చేపడతానన్నారు.



## సంఘ విద్రోహ శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

### చెన్నూరు రూరల్ సీఐ సుధాకర్

చెన్నూరు, ఏప్రిల్ 08. (ప్రభాత ఉదయం) సంఘ విద్రోహ శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని చెన్నూర్ రూరల్ సీఐ సుధాకర్, కోటపల్లి ఎస్సై రాజేందర్ సూచించారు. తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దు గ్రామమైన వెంచపల్లి గ్రామంను చెన్నూర్ రూరల్ సీఐ సుధాకర్, కోటపల్లి ఎస్సై రాజేందర్ లు సందర్శించి తనిఖీలు నిర్వహించారు. ముందుగా ప్రాణహిత నది తీరంను సందర్శించి పడవలు నడిపే యజమానులు, మత్స్యకారులతో మాట్లాడారు. సరిహద్దులలో అనుమానాస్పదంగా ఎవరైనా సంచరించినా, కదలికలలో తేడా కనిపించిన వెంటనే పోలీస్ లకు సమాచారం అందించాలన్నారు. సరిహద్దు గుండా రాకపోకలు సాగిస్తున్న ప్రయాణికులతో మాట్లాడి వారి వివరాలు నమోదు చేశారు. అనంతరం గ్రామంలో సమావేశం ఏర్పాటు చేసి గ్రామస్తులతో మాట్లాడారు. గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు కు గ్రామస్తులు సహకరించాలని సూచించారు. సీసీ కెమెరాల ద్వారా నేరాల నియంత్రణ సాధ్యం అవుతుందని పేర్కొన్నారు. సైబర్ మోసాలు జరుగుతున్న తీరును వివరించిన సీఐ, ఎస్సైలు సైబర్ మోసాల పట్ల అవగాహన కల్పించి, నియంత్రణ చర్యలను వివరించారు. డ్రగ్స్, గంజాయి నియంత్రణకు సహరించాలని, గ్రామాల్లో మత్తు పదార్థాల విక్రయాలు జరిపినా, సేవించిన పోలీస్ లకు తెలియచేయలన్నారు. మహిళ భద్రత కు భంగం కలిగిస్తే చర్యలు తప్పవన్నారు. ప్రతీ ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను పాటించాలని, ట్రాఫిక్ నియమాలను ఉల్లంగిస్తే చర్యలు తప్పవన్నారు. గ్రామంలో సమస్యలు ఉంటే పోలీస్ ల దృష్టి కి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తొన్నారు. అనంతరం గ్రామంలోని య-ువకులకు వాలీబాల్ కిట్ లను అందించి, క్రీడల్లో రాణిస్తూ, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు.



## బిజెపి రంగారెడ్డి రూరల్ జిల్లా అధ్యక్షులు పంతంగి రాజగోపాల్ గౌడ్‌ను సన్మానించిన బిజెపి నాయకులు


రాజేంద్రనగర్, ఏప్రిల్ 8(ప్రభాత ఉదయం) భారతీయ జనతా పార్టీ రంగారెడ్డి జిల్లా రూరల్ అధ్యక్షులు రాజ్ భూపాల్ గౌడ్ ని రాజేంద్రనగర్ డివిజన్ బిజెపి నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు . శుభాకాంక్షలు తెలిపిన వారిలో రాజేంద్రనగర్ డివిజన్ బిజెపి ప్రధాన కార్యదర్శి బండారి బాలకృష్ణ ,కార్యదర్శి పెండ్యాల సురేందర్, రాజేంద్రనగర్ డివిజన్ బీజేవైఎం అధ్యక్షులు ఓబీసీ మోర్చా డివిజన్ కార్యదర్శి యాదయ్య, రాపర్తి గౌడ్, బాలు గౌడ్, అక్షిత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా బిజెపి పార్టీ 45వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

### ముఖ్యఅతిథిగా హాజరైన వడ్డేపల్లి రాజేశ్వరరావు

కూకట్‌పల్లి, ఏప్రిల్ 8 (ప్రభాత ఉదయం) రాష్ట్ర ఓబిసి మోర్చా నాయకులు పులిగోల్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో అల్లాపూర్ డివిజన్ లో డివిజన్ అధ్యక్షుడు విజయ్ అధ్యక్షతన భారతీయ జనతా పార్టీ 45'వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు పాల్గొనగా వారికి డివిజన్ నాయకులు ఘన స్వాగతం పలికారు. వివేకానంద నగర్ పోలింగ్ బూత్ అధ్యక్షుడు సాయి చంద్ బిజెపి జెండాను ఆవిష్కరించగా డివిజన్ నాయకులు కార్యకర్తలు అందరూ భారత్ మాతాకీ జై ! బిజెపి జిందాబాద్ ! అని జయ జయ నినాదాలు చేశారు. అనంతరం ఆనాడు పార్టీ కోసం అమరులైన నాయకులను, కార్యకర్తలను వారు చేసిన ప్రాణ త్యాగాలను గుర్తు చేసుకుని వారికి నివాళులర్పించారు. పార్టీ కోసం అనుక్షణం కష్టపడే కార్యకర్తలు పార్టీ దృష్టిలో ఉంటారని, వారికి సరైన సమయంలో మంచి సముచిత స్థానం కల్పిస్తారని తొందరపాటు నిర్ణయాలు మంచివి కావని తెలియజేస్తూ, ఉచిత వ్యాక్సిన్, ఐదు సంవత్సరాలు 80 కోట్ల మంది ప్రజలకు ఉచితరేషన్ ఇచ్చిన ఘనత నరేంద్ర మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వాన్ని దేనని, రాష్ట్ర ప్రజలు భారతీయ జనతా పార్టీని రోజు రోజుకు ఆదరిస్తున్నారని దానికి ఉదాహరణ మొన్న జరిగినటువంటి ఎమ్మెల్సీ ఎన్నికల్లో రెండు సీట్లను కైవసం చేసుకోవడం అని రాజేశ్వరరావు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అల్లాపూర్ డివిజన్ నాయకులు, కార్యకర్తలు, వివేకానంద నగర్ కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



హ్యాపీ హోమ్స్ కాలనీ చౌరస్తాలో ఉన్న హై టెన్షన్ విద్యుత్ స్తంభం చుట్టు కట్టిన కేబుల్ వైర్ లు తగులబడుతున్న దృశ్యం

## హై టెన్షన్ వైర్లకు మంటలు

బుద్వేల్, ఏప్రిల్ 8(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ సర్కిల్ హప్పీ హోమ్స్ కాలనీ చౌరస్తాలో గల విద్యుత్ హై టెన్షన్ ఫోల్ కు చుట్టు కట్టిన కేబుల్ వైర్లు మంగళవారం ఒకదానికొకటి కలుసుకుని మంటలు చెలరేగాయి. దట్టమైన పొగలు అలుముకోవడంతో స్థానికులు భయాం దోళనలకు గురైనారు. పక్కనే హోటల్ దుకాణాలు ఉండటం, వాహనాలు పార్కింగ్ చేసి ఉం డటంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

## నేడు వ్యవసాయ విశ్వవిద్యాలయం నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సర్వ సభ్య సమావేశం

బుద్వేల్, ఏప్రిల్8 (ప్రభాత ఉదయం) : ఈ నెల 9వ తేదీన మద్యాహ్నం 12 గంటలకు రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల ఆడిటోరియంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర స్థాయి సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్ యాదవ్ ఓ పత్రికటనలో తెలిపారు. ఈ సమావేశానికి రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ తో పాటు టీఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జగదీశ్వర్, ఎస్ఎం హుస్సేనీ ముజీబ్ లు హాజరౌతారన్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం రాష్ట్ర స్థాయి నాయకులందరు ఈ సమావేశంలో పాల్గొంటారని తెలిపారు.

## బీఆర్‌ఎస్ వరంగల్ బహిరంగ సభకు పెద్ద ఎత్తున తరలిరావాలి



మాజీ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డితో బీఆర్‌ఎస్ నాయకులు

బుద్వేల్, ఏప్రిల్ 8 (ప్రభాత ఉదయం): ఈ నెల 27న వరంగల్ లో నిర్వహించనున్న బీఆర్ఎస్ భారీ బహిరంగ సభకు రాజేంద్రనగర్ నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజలు తరలి రావాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మ ంగళవారం శంషాబాద్ లో జరిగిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశానికి రాజేంద్రనగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు పోరెడ్డి ధర్మారెడ్డి అధ్వర్యంలో పెద్ద సంఖ్యలో కార్యకర్తలు తరలివెళ్లారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి వారితో మాట్లాడుతూ, ఈ నెల 27న వరంగల్ లో 10 లక్షల మంది తో నిర్వహించనున్న బీఆర్ఎస్ బహిరంగ సభకు రాజేంద్రనగర్ నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు. ప్రజలు తరలి వచ్చేటట్లు ప్రతి నాయకుడు కృ షి చేయాలన్నారు. సబితా ఇంద్రారెడ్డిని కలసిన వారిలో పోరెడ్డి దర్మారెడ్డితో పాటు వీర్లపల్లి నవీన్ కుమార్, గిరిబాబు, వినాయక ప్రీతమ్ కుమార్, నరేశ్ రెడ్డి, మంజుల, సుజాత, అశ్వక్, కట్టెల గౌతం, పి.సాయిగౌడ్, యశోద తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పోరెడ్డి ధర్మారెడ్డి

# బాలలందరూ స్వేచ్ఛాయుత వాతావరణంలో పెరగాలి

## చైల్డ్ హెల్ప్ లైన్ జిల్లా కో ఆర్డినేటర్ శివలీల

గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 8(ప్రభాత ఉదయం) బాలలందరూ స్వేచ్ఛాయుత వాతావరణం లో పెరగాలని, వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సంబంధిత గ్రామస్థాయి అధికారుల సహకారంతో చర్యలు తీసుకోవాలని చైల్డ్ హెల్ప్ లైన్ జిల్లా కో ఆర్డినేటర్ శివలీల అన్నారు. మంగళవారం ఐజ మండలం వెంకటాపురం గ్రామంలో మహిళా శిశు సంక్షేమ శాఖ వారి చైల్డ్ హెల్ప్ లైన్ 1098 బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో బాలల పరిరక్షణ , సంక్షేమం పై గ్రామ స్థాయి బాలల పరిరక్షణ కమిటీ (విసిపిసి) సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 15 మందితో కూడిన గ్రామస్థాయి బాలల పరిరక్షణ కమిటిని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చైల్డ్ హెల్ప్ లైన్ జిల్లా కో ఆర్డినేటర్ శివలీల మాట్లాడుతూ... గ్రామాలలో బాల్యవివాహాలు బాల కార్మికులుగా పనిచేస్తున్న పిల్లలు , బాలలపై జరుగుతున్న శారీరక , మానసిక వేధింపులను ఈ కమిటీ ద్వారా పరిష్కరించాలని సూచించారు. బాల్య వివాహాలు జరగకుండా ఈ కమిటీ సభ్యులతో పాటు తల్లిదండ్రులు కూడా బాధ్యత తీసుకోవాలన్నారు. తమ పిల్లలను చదివించి ఉన్నత స్థాయికి చేరుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. బాల కార్మిక వ్యవస్థ వల్ల పిల్లల భవిష్యత్తు నాశనం అవుతుందని, పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలకు పంపే విధంగా తల్లితండ్రులు శ్రద్ద వహించాలన్నారు. బడి బయట పిల్లలను గుర్తించి



పాఠశాలలో చేరిన పిల్లలను బడి మానేయకుండా చూసుకోవాలని కోరారు. ఎండలు ఎక్కువ గా ఉన్నందున పిల్లలు ఎండదెడ కొట్టకుండా ఉండేందుకు తగిన జాగ్రత్తలు పాటించాలని అన్నారు. దేశ భవిష్యత్తు పిల్లలపైన ఆధారపడి ఉందని, అందుకు బాలల అభివృద్ధి దేశాభివృద్ధి అని పిల్లలు ఆరోగ్య వంతంగా విద్యతో పాటుగా ఆటలలో రాణించాలని అన్నారు. బాల్యవివాహాలు, బాల కార్మికులు, మైనర్లకు లైంగిక వేధింపులు, పిల్లలను ఇతర రకాల వేధింపులకు గురి చేస్తే 1098 నెంబర్ కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని ఆమె కోరారు. అనంతరం పోషన్ పక్వాడ సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ తెల్లమ్మ, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ ఆచారి పంచాయతీ కార్యదర్శి స్వాతి ఆర్డీఎస్ ఎన్జీవో ప్రతినిధి మధు అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, మహిళా సంఘం అధ్యక్షురాలు, గ్రామ పెద్దలు మరియు పిల్లలు పాల్గొన్నారు.



## సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ట్విన్నింగ్ ఆఫ్ స్కూల్

గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 8(ప్రభాత ఉదయం)ఉపాధ్యాయులు, విద్యార్థులు పరిజ్ఞానాన్ని పరస్పరం పంచుకునేలా రూపొందించిన ట్విన్నింగ్ ఆఫ్ స్కూల్స్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం కేటిదొడ్డి మండలం కుచినేర్ల పాఠశాల విద్యార్థులు నందిన్నె జెడ్పీహెచ్ఎస్ స్కూల్ నిర్వహించిన ట్విన్నింగ్ ఆఫ్ స్కూల్ లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంవిజయ భాస్కర్, ఎంపీ యుపిఎస్ యర్సన్ దొడ్డి ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## జీవో నెం.21 వెనక్కి తీసుకోవాలి

గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 8(ప్రభాత ఉదయం)రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీవో నెంబర్ 21 వల్ల కాంటాక్ట్ మరియు పార్ట్ టైం అధ్యాపకుల జీవితాలు ఆగమ్యగోచరంగా మారిందని, జీవోను వెంటనే రద్దు చేయాలని కాంట్రాక్ట్ అధ్యాపకులు డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటి పిలుపు మేరకు మంగళవారం గద్వాలలోని ప్రభుత్వ పీజీ సెంటర్ నందు అధ్యాపకులు తరగతులు బహిష్కరించి, నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రాష్ట్ర వ్యాప్తంగా 12 యూనివర్సిటీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజేషన్ చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నో ఏండ్లుగా యూనివర్సిటీని నమ్ముకొని పనిచేస్తున్నామని, జూనియర్ లెక్చరర్లు, డిగ్రీ లెక్చరర్లను క్రమబద్ధీకరించినట్లే యూనివర్సిటీ ఒప్పంద అధ్యాపకులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు.ఒప్పంద అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించాకే మిగిలిన పోస్టులను నియమించాలని కోరారు. అనంతరం అదనపు డ్యూటీ లకు రాజీనామా పత్రాలను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చవ్వా వెంకట్ రెడ్డి కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఒప్పంద అధ్యాపకులు డాక్టర్ మంగళగిరి శ్రీనివాసులు, డాక్టర్ మహేందర్, డాక్టర్ గోపినాథ్ రాథోడ్ , వంగూరి గణేష్ పాల్గొన్నారు.



## ధాన్యం సేకరణకు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలి

### జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మి నారాయణ

గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 8 (ప్రభాత ఉదయం)2024 %-%25 యాసంగి సీజన్ లో ధాన్యం సేకరణకు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మి నారాయణ అధికారులను ఆదేశించారు.మంగళవారం ఐడీఓసీ తమ ఛాంబర్ నందు రబీ యాక్షన్ ప్లాన్ పై వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతీ గింజ కొనుగోలు చేయాలని సూచించారు.ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు రైతుల వద్ద ధాన్యం కొనుగోళ్లు చేస్తామన్నారు. రబీ సీజన్ ధాన్యం కొనుగోళ్లను ఏప్రిల్ మూడో వారంలో ప్రారంభించాలని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు కావాల్సిన అన్ని ఏర్పాటు చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో అన్ని వసతులు ఉండేలా చూడాలని, ప్యాడీ క్లీనర్, వేయింగ్ యంత్రాలు, తేమ యంత్రాలు, అవసరమైన గన్ని సంచులు, టార్పాలిన్ కవర్లు అందుబాటులో పెట్టుకోవాలని సూచించారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద త్రాగునీరు,ఓ.ఆర్.ఎస్ పాకెట్లతో ఏర్పాటు చేయాలన్నారు.రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు ఎప్పటికప్పుడు ఓ.పి.ఎం.ఎస్ లో నమోదు చేయాలని,అంతర్ రాష్ట్ర బోర్డర్స్ వద్ద చెక్ పోస్టులు ఏర్పాటు చేయాలన్నారు. గతంలో ఎదురైన ఇబ్బందులు, పొరపాట్లు మళ్లీ జరగకుండా జాగ్రత్త పడాలని సూచించారు. అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంలో పనిచేసి జిల్లాలో ధాన్యం కొనుగోళ్లను సజావుగా కొనసాగించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి స్వామి కుమార్, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ విమల,జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సక్రియ నాయక్, జిల్లా కో ఆపరేటివ్ అధికారి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన శేరి సతీష్ రెడ్డి

కూకట్‌పల్లి, ఏప్రిల్ 8 (ప్రభాత ఉదయం) కూకట్ పల్లి నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి మంగళవారం తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు ఆయన ప్రజాసేవలో స్పీకర్ పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మేకల మైఖేల్, ఆదరణ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, అధ్యక్షులు డా. రఘునాథ్ బాబు అరిగేలా పాల్గొన్నారు. నేతల మధ్య స్నేహపూర్వక వాతావరణంలో జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర రాజకీయ పరిణామాలు, ప్రజా సమస్యలు, సామాజిక సేవా కార్యక్రమాలపై సుదీర్ఘంగా చర్చలు జరిగాయి.శేరి సతీష్ రెడ్డి గతంలో నియోజకవర్గంలో చేపట్టిన సేవా కార్యక్రమాలను స్పీకర్ తో పంచుకోగా డా. రఘునాథ్ బాబు ఆధ్వర్యంలోని ఆదరణ ఫౌండేషన్ చేస్తున్న సేవా కార్యక్రమాల గురించి కూడా సమగ్రంగా వివరించారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ ఈ సందర్భంగా వచ్చిన వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రజల కోసం పనిచేసే ప్రతి ప్రయత్నానికి తన పూర్తి సహకారం ఉంటుందని తెలిపారు.



## భాజపా 45 ఏండ్ల ప్రస్థానం


### పార్టీ జెండా ఎగురవేసిన మాధవరం కాంతారావు

### ఇద్దరు ఎంపీలతో మొదలైన బీజేపీ నేడు ఒక సునామీ

### ఎవరికి వారు స్వచ్ఛందంగా పనిచేసే కార్యకర్తల పార్టీ

### పార్టీలో ప్రతి ఒక్కరికీ గుర్తింపు ఉంటుంది.. మాధవరం కాంతారావు

కూకట్‌పల్లి, ఏప్రిల్ 8 (ప్రభాత ఉదయం) దేశవ్యాప్తంగా భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవ సంబరాలు కొనసాగుతున్నాయని మాధవరం కాంతారావు అన్నారు. మంగళవారం కూకట్ పల్లి అసెంబ్లీ పరిధిలోని బాలాజీ నగర్ 115 డివిజన్ ప్రగతి నగర్ లో డివిజన్ అధ్యక్షుడు వినోద్ గౌడ్ ఆధ్వర్యంలో పోలింగ్ బూత్ నెంబర్ 182,183,184 నందు నిర్వహించిన భాజపా ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు కాంతారావు, మూసాపేట్ కార్పొరేటర్ మహేందర్ ముఖ్య అతిథిగా హాజరై పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంధకారం అస్తమిస్తుంది, సూర్యుడు ఉదయిస్తాడు, కమలం వికసిస్తుంది, సరిగ్గా 45 ఏళ్ల క్రితం భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవం రోజున అటల్ బిహారి వాజ్ పేయి ప్రసంగంలో అన్న మాటలు ఇవి అని, 1980, ఏప్రిల్ 6న శ్యాంప్రసాద్ ముఖర్జీ, దీనదయాల్ ఉపాధ్యాయ, అటల్ బిహారి వాజ్ పేయి, ఎల్కే అద్వాని ఆధ్వర్యంలో బీజేపీ అవతరించిందని, అప్పుడు ఇద్దరు ఎంపీలతో మొదలైన బీజేపీ, ఇప్పుడు ప్రపంచంలోనే అతి పెద్ద రాజకీయ పార్టీగా ఆవిర్భవించిందని అన్నారు, భాజపాలో కుటుంబ, వారసత్వ ఛాయలు ఉండవని, ప్రతి కార్యకర్త ఎలాంటి వ్యక్తిగత ప్రయోజనాలను ఆశించకుండా దేశం కోసం, ధర్మం కోసం పనిచేసే భారతమాత ముద్దు బిడ్డలని కార్యకర్తలను ఉద్దేశించి అన్నారు. 46వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న శుభ సందర్భంగా పార్టీ కార్యకర్తలు, నాయకులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ శ్రీకర్ రావు, బీజేపి సీనియర్ నాయకులు గున్నాల వినోద్, భగవాన్ రెడ్డి సదానంద్, ఓబీసీ అసెంబ్లీ కన్వీనర్ కొనిచర్ల వినోద్, బీజేవైఎం అధ్యక్షుడు శివాచారి, ప్రధాన కార్యదర్శి ఆకుల రాము, వేణుగోపాల్, రాజేందర్ గౌడ్, తిరుపతి రెడ్డి, శ్రీనివాస్ చారి, రేణుక, లక్ష్మీ ,నాగమణి,విజయ్, నర్సింగ్, సీతారాం మరియు బీజేపి నాయకులు, కార్యకర్తలు పార్టీ అభిమానులు, మద్దతుదారులు తదితరులు పాల్గొన్నారు.



## తెనుగు బస్తీలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

### ఫతేనగర్ డివిజన్ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్

కూకట్‌పల్లి, ఏప్రిల్ 8 (ప్రభాత ఉదయం) ఫతేనగర్ డివిజన్ పరిధిలోగల తెలుగు బస్తీలో నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కరిస్తానని స్థానిక కార్పొరేటర్ పండల సతీష్ గౌడ్ అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలో గల తెలుగు బస్తీలో నెలకొన్న స్థానిక సమస్యలపై ఏఈ రాధాకృష్ణ, కార్పొరేటర్ సతీష్ గౌడ్ పర్యటించారు. బస్తీలో ఉన్న రోడ్లు కొంత భాగం దెబ్బతిన్నడంతో నూతన రోడ్లు వేయించాలని, రాత్రి వీలలో వీధిదీపాలు వెలగకపోవడంతో స్థానిక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని వెంటనే ఈ పనులను చేపించాలని కార్పొరేటర్ దృష్టికి స్థానిక ప్రజలు తీసుకొని వచ్చారు. స్పందించిన కార్పొరేటర్ సంబంధిత అధికా రులతో మాట్లాడి ఈ సమస్యలను సత్వరమే పరిష్కరిస్తారని స్థానిక ప్రజలకు హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో కంచి స్వామి కంచి పాండు శ్యామ్ గౌడ్, రాము గౌడ్, కోట సురేష్,కోట కమల్, కోట కృష్ణ చైతన్య తదితరులు పాల్గొనారు.

## తెలంగాణ గిరిజన సమాఖ్య హైదరాబాద్ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

### తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర సీనియర్ నాయకులు రాత్లావత్ శంకర్ నాయక్

సైదాబాద్, ఏప్రిల్ 8(ప్రభాత ఉదయం) తెలంగాణ గిరిజన సమాఖ్య ఏప్రిల్ 9వ తేదీన జరిగే హైదరాబాద్ జిల్లా మాసభలను జయప్రదం చేయాలని తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర సీనియర్ నాయకులు రాత్లావత్ శంకర్ నాయక్ కోరారు. మంగళవారం సైదాబాద్ మండలం సింగరేణి కాలనీలో గల గిరిజన సమాఖ్య కార్యాలయంలో సమావేశం నిర్వహించారు... ఈ సందర్భంగా తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర సీనియర్ నాయకులు రాత్లావత్ శంకర్ నాయక్ మాట్లాడుతూ... తెలంగాణ గిరిజన సమాఖ్య ఆధ్వర్యంలో హైదరాబాద్ నగరంలో గిరిజన సమస్యలపై అనేక పోరాటాలు నిర్వహించామని, పొట్ట చేత పట్టుకొని జీవనం సాగించేందుకు హైదరాబాద్ వలసలు వచ్చే అన్ని జిల్లాల గిరిజనులు, నగరంలో నివాస ప్రాంతాలైన గిరిజన కాలనీల సమస్యలు మరియు గిరిజనులకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు సాధించుటకు అనేక భూ పోరాటాలు ఉద్యమాలలో తెలంగాణ గిరిజన సమాఖ్య ప్రధాన పాత్ర పోషించామని భవిష్యత్తు కర్తవ్యాలు నిర్వహించేందుకు గిరిజన సమాఖ్య హైదరాబాద్ జిల్లా మహాసభ ఏప్రిల్ 9వ తేదీన నిర్వహించి భవిష్యత్తు పోరాటాలను ఇండ్లు, ఇండ్ల స్థలాలకై పేద ప్రజలకు కూడు, గూడు, గుడ్డ కోసం గిరిజనుల సమస్యలపై నిలువ నీడ లేని ప్రజలకు నీడ కావాలని భూమి కావాలని భూ పోరాటాలు మరియు గిరిజన సమస్యల పరిష్కారానికి భవిష్యత్తు కర్తవ్యాలను మహాసభలో చర్చించి నిర్మిస్తామని కావున ఏప్రిల్ 9వ తేదీన జరిగే ఈ మహాసభలో గిరిజనులు ప్రతి ఒక్కరు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు... ఈ కార్యక్రమంలో గిరిజన సమాఖ్య హైదరాబాద్ నగర నేతలు రమావత్ హరినాయక్, ఆంగోత్ రఘుపతి నాయక్, నేనావత్ రూప్సింగ్ నాయక్ , వాంక్డోత్ దస్రునాయక్ , నేనావత్ రాజునాయక్ , వడిత్య దస్రునాయక్ తదితరులు పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608